




PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

# సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

జర్నలిస్ట్ శక్తి ప్రజల పక్షం
జర్నలిస్ట్ సంక్షేమం లక్ష్యం
TJWA
Regd. No: 288/2026
తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్
తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం
జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ - సంక్షేమమే మా ధ్యేయం

| గురువారం 03 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 సంచిక : 93 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|


## గ్లోబల్ సమ్మిట్-రక్షణ ఎక్స్‌పోలో భాగస్వాములు కండి





సెప్టెంబర్ 3, 2026, న్యూఢిల్లీ (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026కు హాజరుకావాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించే రక్షణ ఎక్స్‌పో-2026ను ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఢిల్లీలో బుధవారం రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన రేవంత్‌రెడ్డి రక్షణ ఎక్స్‌పో నిర్వహణ, రాష్ట్రంలోని రక్షణ రంగ ప్రాజెక్టులు, పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. రక్షణ ఎక్స్‌పోలో ఏరోస్పేస్, రక్షణ, అంతరిక్ష రంగాలకు సంబంధించిన ప్రత్యేక సదస్సుతో పాటు ఎయిర్‌షో, పారిశ్రామిక ప్రదర్శన, భూ రక్షణ వ్యవస్థల ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా రక్షణ రంగ పరిశ్రమలు, అంకుర సంస్థలు, యువ శాస్త్రవేత్తలు పాల్గొనే ఈ ఎక్స్‌పోకు రక్షణ శాఖ మంత్రి హాజరై మార్గనిర్దేశం చేస్తే ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎక్స్‌పోను అంతర్జాతీయ ప్రమాణాలతో విజయవంతంగా నిర్వహించేందుకు రక్షణ శాఖ సహకరించాలని కోరిన సీఎం, ఎయిర్‌షో నిర్వహణకు అవసరమైన గగనతల అనుమతులు మంజూరు చేయడంతో పాటు భారత వైమానిక దళానికి చెందిన విమానాలు, సూర్యకిరణ్, సారంగ్ ఏరోబాటిక్ బృందాలు ప్రదర్శనలో పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థిర విమాన ప్రదర్శనకు కూడా సహకరించాలని, భూ, నౌకా, వైమానిక దళాలకు చెందిన అత్యాధునిక రక్షణ వ్యవస్థలను ఎక్స్‌పోలో ప్రదర్శించాలని కోరారు. త్రివిధ దళాల ఉన్నతాధికారులు, ప్రతినిధులు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులు కార్యక్రమంలో భాగస్వాములు కావాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హెచ్ఏఎల్, బీఈఎల్, బీడీఎల్, ఎండీఎల్ తదితర రక్షణ ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు డీఆర్‌డీవో ప్రయోగశాలలు విస్తృతంగా పాల్గొని స్వదేశీ రక్షణ సాంకేతికతను ప్రదర్శించేలా సహకరించాలని కోరారు. విదేశీ రక్షణ శాఖ ప్రతినిధులు, ద్వైపాక్షిక రక్షణ ప్రతినిధి బృందాలు, అంతర్జాతీయ రక్షణ సంస్థల ప్రముఖులతో సమావేశాలు నిర్వహించేందుకు కేంద్ర రక్షణ శాఖ సహకరించాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంబంధించి ఇప్పటికే 750 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని, రక్షణ శాఖ కోరిన మేరకు మరో 750 ఎకరాలను సేకరించి మొత్తం 1,500 ఎకరాల భూమిని సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు కేంద్ర మంత్రికి తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు 416.18 ఎకరాల భూమిని కేటాయించేందుకు టీజీఐఐసీ అంగీకరించిందని సీఎం వెల్లడించారు. ఈ భూమిని 33 సంవత్సరాల కాలానికి మొత్తం భూమికి సంవత్సరానికి కేవలం రూ.1 నామమాత్రపు లీజు అద్దెతో కేటాయించనున్నట్లు తెలిపారు. అవసరమైతే మరో రెండు పర్యాయాలు లీజును పొడిగించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర శక్తి శాఖ మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, సురేశ్ షెట్కార్, పోరిక బలరాం నాయక్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్) హర్కార వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీలో గజం భూమి రూ.2.70 లక్షలు

### రూ.47.14 కోట్ల ఆదాయం.. చదరపు గజం గరిష్ఠంగా రూ.2.70 లక్షలకు విక్రయం

సెప్టెంబర్ 3, 2026, హైదరాబాద్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఓపెన్ ప్లాట్లు మరోసారి రికార్డు ధరలకు అమ్ముడయ్యాయి. ఎలాంటి వివాదాలు లేని, అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చెంది మంచి డిమాండ్ ఉన్న కేపీహెచ్‌బీ 7వ ఫేజ్‌లోని 16 ఎంఐజీ ఓపెన్ ప్లాట్లకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలంలో భారీ ధరలు నమోదయ్యాయి. చదరపు గజానికి కనీస ధరను రూ.1.60 లక్షలుగా నిర్ణయించగా, అత్యధికంగా ఒక ప్లాట్ చదరపు గజం రూ.2.70 లక్షలకు విక్రయమైంది. మరో ప్లాట్ చదరపు గజం రూ.2.36 లక్షలకు, మరో రెండు ప్లాట్లు చదరపు గజం రూ.2.06 లక్షల చొప్పున వేలంలో అమ్ముడయ్యాయి. ఈ ప్లాట్ల బహిరంగ వేలానికి సంబంధించి హౌసింగ్ బోర్డు ఆగస్టు 10న నోటిఫికేషన్ జారీ చేసింది. పూర్తిగా పారదర్శకంగా నిర్వహించిన వేలంలో తమకు నచ్చిన ప్లాట్లను దక్కించుకునేందుకు మొత్తం 19 మంది బిడ్డర్లు పోటీ పడ్డారని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. బుధవారం నిర్వహించిన వేలంలో చదరపు గజం సగటు ధర సుమారు రూ.1.79 లక్షలు పలికిందని ఆయన వెల్లడించారు. ఈ బహిరంగ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ.47.14 కోట్ల మేర ఆదాయం సమకూరిందని వి.పి. గౌతం తెలిపారు.



## పాలంపేట 'గొల్లల గుడి'కి జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు

సెప్టెంబర్ 3, 2026, ములుగు (సందేశం టైమ్స్ ప్రతినిధి): ములుగు జిల్లా పాలంపేటలోని చారిత్రక 'గొల్లల గుడి'కి జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు లభించింది. ఈ మేరకు కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వశాఖ పరిధిలోని భారత పురావస్తు అధ్యయన విభాగం (ఏఎస్ఐ) ఆగస్టు 31, 2026న అధికారిక ప్రకటన జారీ చేసింది. ఈ ప్రకటన 'గెజిట్ ఆఫ్ ఇండియా' ప్రత్యేక సంచికలో ప్రచురితమైంది. ప్రాచీన కట్టడాలు, పురావస్తు ప్రదేశాలు, అవశేషాల చట్టం-1958లోని సెక్షన్ 4, ఉప సెక్షన్ (3) కింద సంక్రమించిన అధికారాలతో ఏఎస్ఐ ఈ గుర్తింపును ప్రకటించింది. పాలంపేటలోని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం కాకతీయ రుద్రేశ్వర (రామప్ప) ఆలయానికి నైరుతి దిశలో గొల్లల గుడి ఉంది. కాకతీయుల కాలం నాటి ఈ ఆలయం తూర్పు ముఖంగా ఉన్న మండపంతో పాటు చుట్టూ మూడు గర్భాలయాలు కలిగిన త్రికూటాలయంగా నిర్మితమై ఉంది. శిల్పకళతో అలంకరించిన ప్రహరీ, పైకప్పు అంచుల నిర్మాణం, ద్వారబంధాల వద్ద చెక్కిన హంసల వరుస, సునిశిత రంధ్రాల వల పనితనం ఆలయ ప్రత్యేకతను చాటుతున్నాయి. ప్రధాన ఆలయానికి ముందు భాగంలో రెండు ఉప ఆలయాలు ఉండగా, వాటి ద్వారపాలకుల విగ్రహాలు అత్యంత సుందరంగా చెక్కబడ్డాయి. అంతరాలయాల అంచులు సైతం శిల్పకళా నైపుణ్యంతో ఆకట్టుకుంటాయి. ప్రధాన మండపం నుంచి మధ్యలోని ప్రధాన మందిరానికి మార్గం ఉండగా, ఉత్తర, దక్షిణ, పశ్చిమ దిశల్లో అంతరాలయాలతో కూడిన మూడు గర్భాలయాలు ఉన్నాయి. ఆలయ కుడ్యాలపై ఉన్న వివిధ గూళ్లలో విష్ణుమూర్తి, లక్ష్మి, గణేశుడు, మహిషాసురమర్దిని తదితర దేవతా విగ్రహాలు దర్శనమిస్తాయి. జంతువుల ఆకృతులు, పుష్పాలంకరణలతో కూడిన ఎత్తయిన వేదికపై నిర్మితమైన గొల్లల గుడికి తాజాగా జాతీయ ప్రాధాన్య కట్టడంగా గుర్తింపు లభించడంతో కాకతీయుల శిల్పకళా వైభవానికి మరో అరుదైన గుర్తింపు దక్కినట్లయింది.

## సింగరేణి భూగర్భ గనుల ప్రైవేటీకరణ వార్తలు అవాస్తవం



సెప్టెంబర్ 3, 2026, హైదరాబాద్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): సింగరేణి భూగర్భ బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ యాజమాన్యం స్పష్టం చేసింది. భూగర్భ గనులను ప్రైవేటీకరించేందుకు ప్రస్తుతం సంస్థ వద్ద ఎలాంటి ప్రతిపాదన పరిశీలనలో లేదని తెలిపింది. బాధ్యతాయుతమైన ప్రభుత్వ రంగ సంస్థగా సింగరేణి ప్రస్తుతం 21 భూగర్భ గనులు, 17 ఓపెన్‌కాస్ట్ గనుల ద్వారా బొగ్గు ఉత్పత్తి చేస్తూ తెలంగాణతో పాటు తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు బొగ్గును సరఫరా చేస్తూ దేశ ఇంధన భద్రత, పారిశ్రామిక అభివృద్ధికి నిరంతరం తోడ్పడుతోందని పేర్కొంది. సింగరేణిలోని కొన్ని భూగర్భ గనులు ఆర్థికంగా నష్టాల్లో ఉన్నప్పటికీ తెలంగాణ ప్రాంతంలో ఉపాధి కల్పన, ఉద్యోగ భద్రతను దృష్టిలో ఉంచుకుని నష్టాలను సాధ్యమైనంత మేర తగ్గిస్తూ వాటిని కొనసాగిస్తున్నట్లు యాజమాన్యం వెల్లడించింది. భూగర్భ గనులను మూసివేయడం లేదా ప్రైవేటుపరం చేయడం కాకుండా వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, నిర్వహణ వ్యయాలను తగ్గించడం ద్వారా సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది. భారీ నష్టాల్లో కొనసాగుతున్న శాంతిఖని భూగర్భ గనిలో ఉత్పత్తి కార్యకలాపాలను మైన్ డెవలపర్ అండ్ ఆపరేటర్ విధానంలో నిర్వహించడం ద్వారా ఉత్పత్తి వ్యయాలను తగ్గించి నష్టాలను నివారించగలమా అనే అంశాన్ని అధ్యయనం చేసేందుకు మాత్రమే పైలట్ ప్రాజెక్టుగా ప్రతిపాదన రూపొందించినట్లు వివరించింది. ఇందులో భాగంగా ఈ ఏడాది జనవరి 2న ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన జారీ చేసి సంస్థల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానించగా, తొలుత జనవరి 15 వరకు గడువు ఇచ్చినా ఎలాంటి సంస్థ ఆసక్తి చూపలేదని, అనంతరం గడువును జనవరి 22 వరకు పొడిగించగా ఒక సంస్థ ముందుకొచ్చిందని తెలిపింది. అయితే తదుపరి దశలో ఆ సంస్థ కూడా ప్రక్రియలో కొనసాగేందుకు సంసిద్ధత వ్యక్తం చేయకపోవడంతో తగిన స్పందన లభించని కారణంగా ఆ ప్రతిపాదనను విరమించుకున్నట్లు స్పష్టం చేసింది. శాంతిఖని గనికి సంబంధించి జారీ చేసిన ఈఓఐని ఆధారంగా చేసుకుని సింగరేణి భూగర్భ గనులను ప్రైవేటుపరం చేస్తోందని ప్రచారం చేయడం వాస్తవ విరుద్ధమని యాజమాన్యం పేర్కొంది. భూగర్భ గనులను మరింత సమర్థవంతంగా నిర్వహించడం, నష్టాలను తగ్గించడం, సాధ్యమైనన్ని గనులను లాభదాయకంగా మార్చడం ద్వారా తెలంగాణ ప్రాంతంలో ప్రస్తుత ఉపాధి అవకాశాలను పరిరక్షించడంతో పాటు భవిష్యత్తులో మరింత ఉపాధి కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపింది. వాస్తవాలను నిర్ధారించుకోకుండా ఇలాంటి వార్తలను ప్రచురించడం వల్ల సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబాలు, ప్రజల్లో అనవసర ఆందోళన ఏర్పడే అవకాశం ఉందని యాజమాన్యం పేర్కొంది.

## వైఎస్ ఆశయాలను నూటికి నూరు శాతం కొనసాగిస్తాం



సెప్టెంబర్ 3, 2026, న్యూఢిల్లీ (సందేశం టైమ్స్ ప్రతినిధి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను నూటికి నూరు శాతం ముందుకు తీసుకెళ్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. ఢిల్లీలో నిర్వహించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అవార్డ్స్-2026 కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విద్య, సాగునీటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని, ఆయన ముందుచూపు కారణంగానే దేశం ఆకలి కేకల నుంచి ఆహార ధాన్యాలను ఎగుమతి చేసే స్థాయికి చేరుకుందని పేర్కొన్నారు. రైతులు పండించే పంటలకు మద్దతు ధర కల్పించే చర్యలను దేశంలో తొలిసారిగా చేపట్టిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుందని, అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేసే విధానాన్ని తీసుకొచ్చిన చరిత్ర కూడా ఆమెదేనన్నారు. దేశంలోని ప్రతి ఒక్కరికీ ఆహార భద్రత కల్పించాలనే లక్ష్యంతో సోనియా గాంధీ ఆహార భద్రత చట్టాన్ని తీసుకొచ్చారని, ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు అందించే ప్రజా పంపిణీ వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వాలే బలోపేతం చేశాయని అన్నారు. తెలంగాణలో 3 కోట్ల 48 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామంటే గత కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ చర్యలే అందుకు కారణమని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్‌పై తొలి సంతకం చేసిన గొప్ప వ్యక్తి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని, ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.1,300 కోట్ల విద్యుత్ బకాయిలను రద్దు చేయడంతో పాటు రైతులపై ఉన్న కేసులను ఎత్తివేసి వారి గుండెల్లో రారాజుగా నిలిచారని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో సాగునీటి వసతుల కోసం ప్రాణహిత-చేవెళ్ల, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం, ఎస్ఎల్‌బీసీ సొరంగం వంటి ప్రాజెక్టులను ప్రారంభించిన ఘనత వైఎస్ రాజశేఖర్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. వైఎస్ ప్రారంభించిన ప్రాణహిత-చేవెళ్ల, ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టులు ప్రస్తుతం నిలిచిపోయాయని, వాటిని పూర్తి చేసి తెలంగాణ సమాజానికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. వైఎస్ అభిమానులకు ఒక విషయాన్ని గుర్తుచేస్తూ, ఆయన చివరి కోరిక ఇంకా నెరవేరలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తన జీవిత లక్ష్యం రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేయడమేనని చెప్పారని, అయితే ఆ కోరిక నెరవేరకముందే ఆయన మరణించారని తెలిపారు. దేశ ప్రజలు కష్టాల్లో ఉన్న సమయంలో వారికి అండగా నిలబడాల్సిన చారిత్రక సందర్భం ఇప్పుడు దేశానికి అవసరమని, దేశానికి బలమైన నాయకుడు రాహుల్‌గాంధీ అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేయడమే వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నిజమైన నివాళి అని, ఆయన చివరి కోరికను నెరవేర్చేందుకు రాబోయే ఎన్నికల్లో రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడానికి ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులంతా కలిసి కష్టపడి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

## మైనారిటీ మహిళల స్వయం ఉపాధికి చేయూత

సెప్టెంబర్ 3, 2026, రంగారెడ్డి (సందేశం టైమ్స్ ప్రతినిధి): మైనారిటీ మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధికి తెలంగాణ ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. రంగారెడ్డి జిల్లాలో బుధవారం తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మొహమ్మద్ ఒబేదుల్లా కోత్వాల్‌తో కలిసి మంత్రి మైనారిటీ లబ్ధిదారులకు ఆర్థిక సాయం, జీవనోపాధి ప్రోత్సాహకాలను పంపిణీ చేశారు. 'ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన' కింద 278 మంది మైనారిటీ వితంతు మహిళలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సాయం మహిళలు, వారి కుటుంబాల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు ఆర్థికంగా బలోపేతం కావడానికి దోహదపడుతుందని మంత్రి తెలిపారు. 'మైనారిటీ కమ్యూనిటీకి తుర్క్ కాశా పునరావాసం' పథకం కింద 13 మంది తుర్క్ కాశా ముస్లిం కమ్యూనిటీ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.60 వేల విలువైన జనరేటర్లు, టూల్‌కిట్లను పంపిణీ చేశారు. వీటి ద్వారా లబ్ధిదారులు స్వయం ఉపాధి పొందడంతో పాటు తమ జీవనోపాధిని మరింత మెరుగుపరుచుకోవచ్చని పేర్కొన్నారు. విస్తృతమైన, వైవిధ్యభరితమైన పారిశ్రామిక ప్రాంతాలు ఉండటంతో రంగారెడ్డి జిల్లా దేశంలోని అభివృద్ధి చెందిన జిల్లాల్లో ఒకటిగా ఎదిగిందని, పరిశ్రమల అభివృద్ధితో ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయని మంత్రి అన్నారు. జిల్లాలో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న కుట్టు మిషన్లు, జనరేటర్లు, టూల్‌కిట్లు, ఇతర సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మైనారిటీ మహిళల ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, మైనారిటీల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని అజహరుద్దీన్ తెలిపారు. మదీనా బస్సు అగ్నిప్రమాద ఘటన అనంతరం బాధిత కుటుంబాలకు పరిహారం అందించేందుకు ముఖ్యమంత్రి వెంటనే నిర్ణయం తీసుకోవడం ఇందుకు నిదర్శనమన్నారు. హజ్ ఏర్పాట్లకు సంబంధించిన పనుల కోసం ముఖ్యమంత్రి రూ.7 కోట్లు మంజూరు చేయడం కూడా మైనారిటీ సమాజ సంక్షేమం పట్ల ప్రభుత్వ నిబద్ధతను చాటుతోందని పేర్కొన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్న మంత్రి, తన తల్లి తనకు దుస్తులు కుట్టి ఇచ్చేవారని, కుట్టు మిషన్లతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని తెలిపారు. తన క్రికెట్ కెరీర్‌ను ప్రస్తావిస్తూ, నిధుల కోసం నాయకులు చేస్తున్న డిమాండ్ల విషయంలో కూడా తాను సెంచరీ కొడతానని సరదాగా వ్యాఖ్యానించారు. మహిళలు, యువత స్వయం ఆధారితంగా ఎదిగేలా నైపుణ్యాలు, అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని, చేపలు పట్టడం నేర్పించినట్లుగా వారికి జీవనోపాధి సాధనాలను అందిస్తే వారు తమకు తాము ఉపాధి పొందడంతో పాటు ఇతరులకు కూడా అండగా నిలవగలరని అన్నారు. తాను పదవిలో ఉన్నంతకాలం ప్రజల కోసం పనిచేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పాతబస్తీ యువతకు కమ్యూనిటీ నాయకులు, పెద్దలు సరైన మార్గనిర్దేశం చేయాలని, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, ఇతర ఉత్పాదక కార్యక్రమాల ద్వారా యువత తమ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. టీజీఎంఎఫ్‌సీ చైర్మన్ మొహమ్మద్ ఒబేదుల్లా కోత్వాల్ మాట్లాడుతూ మైనారిటీ సమాజ సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి మహ్మద్ అజహరుద్దీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, చీఫ్ విప్ అండ్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్మయి, రంగారెడ్డి జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి, టీజీఎంఎఫ్‌సీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కుట్టు మిషన్ల పథకం ప్రక్రియను వేగవంతం చేయాలి

సెప్టెంబర్ 3, 2026, హైదరాబాద్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న కుట్టు మిషన్ల పథకం దరఖాస్తులు, కొనుగోలు, టెండర్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పలు అంశాలపై సమీక్షించారు. కుట్టు మిషన్ల కోసం ఇప్పటివరకు వివిధ జిల్లాల నుంచి 1,80,170 దరఖాస్తులు అందినట్లు అధికారులు మంత్రికి వివరించగా, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ సెప్టెంబర్ 15 వరకు కొనసాగుతుందని తెలిపారు. కుట్టు మిషన్ల కొనుగోలు ప్రక్రియను సెప్టెంబర్ 7లోపు పూర్తి చేయాలని, సెప్టెంబర్ 15 తర్వాత ప్రీ-బిడ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. వెయ్యి కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన నియోజకవర్గాలను గుర్తించి జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఆధ్వర్యంలో కలెక్టర్, ఇతర అధికారులు, మహిళా సంఘాలు, గ్రామపంచాయతీల సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యేలోపు అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పథకం అమలుపై సమీక్షిస్తామని తెలిపారు. ఇటీవల వివిధ బీసీ కుల సంఘాల కార్పొరేషన్లకు ఎన్నికైన చైర్మన్లకు కార్యాలయాలు, మౌలిక సదుపాయాల కల్పనను వేగవంతం చేయాలని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీని ఆదేశించారు. బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, పురోగతిపై కూడా చర్చించారు. రాష్ట్రంలోని 327 మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల పనితీరు, మౌలిక సదుపాయాలు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, విద్యార్థుల సమస్యలను మంత్రి సమీక్షించారు. 327 గురుకులాల్లో ప్రస్తుతం 22 పాఠశాలలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నందున, మిగిలిన పాఠశాలలకు అవసరమైన భవనాలు, స్థలాలపై సమగ్ర నివేదికను సెప్టెంబర్ 15లోపు అందించాలని ఆర్‌సీవోలను ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా స్థలాల లభ్యతపై నివేదిక రూపొందించి, అవసరమైన చోట జిల్లా కలెక్టర్ల ద్వారా స్థల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఇందుకోసం బీసీ సంక్షేమ శాఖకు చెందిన నలుగురు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఒక నియోజకవర్గానికి మంజూరైన గురుకుల పాఠశాలలు ఇతర నియోజకవర్గాల్లో కొనసాగుతున్నట్లయితే వాటిని గుర్తించి, మంజూరైన నియోజకవర్గంలోనే పాఠశాలలను నిర్వహించేలా అనువైన భవనాలను గుర్తించి తరలించాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలు, బీసీ సంక్షేమ హాస్టళ్ల భవనాల అద్దెలు, పెండింగ్ బిల్లుల పరిష్కారానికి సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యార్థులకు యూనిఫాంలు, షూస్, ఇతర మౌలిక సదుపాయాల కల్పన ఎంతవరకు పూర్తయిందో, తక్కువ శాతం మాత్రమే పూర్తయిన పాఠశాలలు ఏవో గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన ప్రత్యేక కేసులు, గతంలో మంజూరైన స్కాలర్‌షిప్‌లు, వచ్చిన దరఖాస్తులు, పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి అర్హులైన విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పెండింగ్ దరఖాస్తులను పరిశీలించాలని సూచించారు. కళ్యాణలక్ష్మి పథకానికి సంబంధించి హైకోర్టు స్టే ఎత్తివేయడంతో 2023–26 మధ్య వచ్చిన దరఖాస్తులు, క్లియర్ చేసిన చెక్కులు, పెండింగ్ దరఖాస్తుల వివరాలను మంత్రి తెలుసుకుని, అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందేలా దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా బీసీ స్టడీ సర్కిళ్లను ఆధునీకరించి గ్రూప్స్, పోలీస్ ఉద్యోగాలు, ఇతర పోటీ పరీక్షలు, నైపుణ్య శిక్షణకు నాణ్యమైన శిక్షణ అందించే విధానంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించారు. గీత కార్మికుల భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షణ కవచాల పంపిణీపై కూడా మంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది గీత కార్మికులు ఉండగా, 40 వేల మంది శిక్షణ పూర్తి చేసుకున్నారని అధికారులు తెలిపారు. శిక్షణ పొందిన వారిలో ఎంతమందికి రక్షణ కిట్లు అందాయో వివరాలు సేకరించి, మిగిలిన వారికి కూడా త్వరగా అందించాలని, ప్రతి గ్రామంలో కనీసం 10 రక్షణ కిట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. నీరా కేఫ్‌కు సెప్టెంబర్ 7లోపు, నందనం ప్రాజెక్టుకు సెప్టెంబర్ 15లోపు రీటెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఒక మోడర్న్ దోబీఘాట్ ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మొదటి దశలో హుస్నాబాద్, హుజూరాబాద్, చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లో మోడర్న్ దోబీఘాట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ పరిధిలోని ప్రతి పథకం, కార్యక్రమం లబ్ధిదారులకు సమర్థవంతంగా చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బాలమాయాదేవి, ఎంజేపీ సెక్రెటరీ సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, అలోక్ కుమార్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



## మామునూరు, ఆదిలాబాద్ విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలి

సెప్టెంబర్ 3, 2026, న్యూఢిల్లీ (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణలో విమానయాన మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించి ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కీలక చర్యలకు శ్రీకారం చుట్టారు. ఢిల్లీలోని రాజీవ్‌గాంధీ భవన్‌లో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో ముఖ్యమంత్రి సమావేశమై తెలంగాణలోని ఆదిలాబాద్, మామునూరు (వరంగల్) విమానాశ్రయాల పనులను వేగవంతం చేయాలని కోరారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసి భూమిని అప్పగించిందని రేవంత్‌రెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన రామ్మోహన్ నాయుడు మామునూరు విమానాశ్రయ పనులకు సంబంధించిన టెండర్లను రెండు వారాల్లో పిలిచి, డిసెంబరులో టెండర్ ప్రక్రియను ఖరారు చేసి అదే నెలలో పనులకు శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మామునూరు విమానాశ్రయాన్ని కేవలం ప్రయాణికుల రాకపోకలకే పరిమితం చేయకుండా తెలంగాణ ఉత్తర ప్రాంత ఆర్థిక, పారిశ్రామిక అభివృద్ధికి ఉపయోగపడేలా మౌలిక వసతులు కల్పించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం వివరించారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి ప్రయాణికుల టెర్మినల్‌తో పాటు సరకు రవాణా టెర్మినల్, విమానాల నిర్వహణ, మరమ్మతులు, సమగ్ర తనిఖీలకు సంబంధించిన ఎంఆర్‌ఓ సదుపాయాలను ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఆదిలాబాద్ విమానాశ్రయ రన్‌వేకు సంబంధించిన అంశాలను పరిష్కరించేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖలతో సంయుక్త సమావేశం నిర్వహించి తుది నిర్ణయం తీసుకోవాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత విస్తరించేందుకు హెలికాప్టర్ ఆధారిత పర్యాటక సేవలను ప్రోత్సహించేందుకు కేంద్ర సహకారం అందించాలని కూడా కోరారు. ఇదే సమావేశంలో హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో సీ ప్లేన్ ల్యాండింగ్ సదుపాయం ఏర్పాటు చేసే ప్రతిపాదనపైనా చర్చ జరిగింది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాల నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధితో పాటు సరకు రవాణా, విమానాల నిర్వహణ కేంద్రాలు, హెలీ టూరిజం, సీ ప్లేన్ సేవలను అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రంలో వైమానిక అనుసంధానాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ సమావేశంలో ఎంపీలు సురేశ్ షెట్కార్, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రోటోకాల్) హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## అలవాటుగా మారే మందుల అక్రమ విక్రయాలపై రాష్ట్రవ్యాప్తంగా దాడులు

సెప్టెంబర్ 3, 2026, హైదరాబాద్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): అలవాటుగా మారే మందుల అక్రమ విక్రయాలను అరికట్టేందుకు తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టీజీ సేఫ్) డ్రగ్స్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు, దాడులు నిర్వహించారు. సెప్టెంబర్ 2న రాష్ట్రంలోని పలు రిటైల్ మెడికల్ షాపుల్లో అధికారులు తనిఖీలు చేపట్టి అలవాటుగా మారే మందుల అక్రమ విక్రయాలు, నిల్వలు, నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ట్రామాడోల్ మాత్రలు, ప్రీగాబాలిన్ కలిగిన ఔషధాలు, నైట్రాజెపామ్ మాత్రలు, ఆల్ప్రాజోలం మాత్రలు, టాపెంటాడోల్ మాత్రలు, కోడైన్ కలిగిన దగ్గు సిరప్‌లు, జోల్పిడెమ్ మాత్రలు తదితర మందుల విక్రయాలను అధికారులు పరిశీలించారు. తనిఖీల సందర్భంగా 158 మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధమైన అంశాలు గుర్తించినట్లు టీజీ సేఫ్ డ్రగ్స్ విభాగం వెల్లడించింది. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఆయా మెడికల్ షాపులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, శాఖాపరమైన చర్యలకు ప్రక్రియ ప్రారంభించినట్లు తెలిపింది. అవసరాన్ని బట్టి సంబంధిత ఔషధ దుకాణాల డ్రగ్ లైసెన్సులను సస్పెండ్ చేయడం లేదా రద్దు చేయడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో అలవాటుగా మారే ఔషధాల అక్రమ విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు, చర్యలు కొనసాగుతాయని టీజీ సేఫ్ డ్రగ్స్ విభాగం స్పష్టం చేసింది.

## రైతు సంక్షేమంలో వైఎస్సార్‌ది ప్రత్యేక ముద్ర

సెప్టెంబర్ 3, 2026, న్యూఢిల్లీ (సందేశం టైమ్స్ ప్రతినిధి): వ్యవసాయ రంగంలో రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పులు తీసుకువచ్చిన మహనీయుల్లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ ముందువరుసలో నిలుస్తారని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. న్యూఢిల్లీలో కేవీపీ వైఎస్సార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి, అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, స్వామినాథన్ వ్యవసాయ రంగానికి శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన ఫలాలను అందించగా, వైఎస్సార్ రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందనే నమ్మకాన్ని కల్పించారని పేర్కొన్నారు. ఒకప్పుడు ఆహార కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్న దేశాన్ని హరిత విప్లవం ద్వారా ఆహార భద్రత దిశగా నడిపించడంలో నాటి ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ సంకల్పంతో పాటు స్వామినాథన్ వంటి శాస్త్రవేత్తల కృషి కీలకమైందని భట్టి విక్రమార్క గుర్తుచేశారు. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్సార్ వ్యవసాయాన్ని కేవలం పంటల సాగుగా కాకుండా రైతు కుటుంబ సంక్షేమంతో ముడిపడిన అంశంగా భావించారని తెలిపారు. రైతులకు ఉచిత విద్యుత్, సాగునీరు, రుణ సదుపాయాలతో పాటు వారి కుటుంబాలకు వైద్యం, విద్యను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతు సంక్షేమాన్ని పాలనలో ప్రధాన భాగంగా మార్చారని ప్రశంసించారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు సైతం విస్మరించలేని విధంగా రైతు సంక్షేమానికి వైఎస్సార్ బలమైన పునాది వేశారని అన్నారు. తన రాజకీయ జీవితంలో వైఎస్సార్ నాయకత్వంలో చీఫ్ విప్‌గా పనిచేసే అవకాశం దక్కడం తనకు అరుదైన అనుభవమని భట్టి విక్రమార్క భావోద్వేగంతో గుర్తుచేశారు. 2009 ఎన్నికల అనంతరం ఎన్నికైన 74 మంది యువ ఎమ్మెల్యేలకు అవగాహన కల్పించేందుకు వైఎస్సార్ సూచన మేరకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని, వాటికి వైఎస్సార్ ప్రతిరోజూ హాజరై దేశ సమైక్యత, పేదల సంక్షేమం, అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కృషిని యువ ఎమ్మెల్యేలకు వివరించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జీవితాంతం కృషి చేయాలన్న వైఎస్సార్ మార్గదర్శనం ఇప్పటికీ తమకు స్ఫూర్తినిస్తోందన్నారు. వైఎస్సార్, డాక్టర్ కె.వి.పి. రామచంద్రరావుల మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహబంధం ఎందరికో ఆదర్శమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గుల్బర్గాలో విద్యార్థి దశ నుంచే ప్రారంభమైన వారి ప్రయాణంలో ఎదురైన సమస్యల పరిష్కారానికి అప్పటి విద్యార్థి నాయకుడిగా ఉన్న ప్రస్తుత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసేవారని, ఖర్గే వారికి అండగా నిలిచి మార్గనిర్దేశం చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్ భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కె.వి.పి. రామచంద్రరావు డాక్టర్ వైఎస్సార్, డాక్టర్ కేవీపీ ఫౌండేషన్‌ను స్థాపించి ఢిల్లీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం వారి స్నేహానికి నిదర్శనమని అన్నారు. గ్రామీణ భారత అభ్యున్నతికి కృషి చేస్తున్న ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్, వైఎస్సార్ ఫౌండేషన్ నిర్వాహకులను ఉప ముఖ్యమంత్రి అభినందించారు.

## అక్రమ పాన్‌మసాలా, గుట్కా తయారీ కేంద్రంపై వాణిజ్య పన్నుల శాఖ దాడి

సెప్టెంబర్ 3, 2026, హైదరాబాద్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ అక్రమంగా పాన్‌మసాలా, గుట్కా తయారీ, నిల్వ, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై కొరడా ఝుళిపించింది. నిర్దిష్ట సమాచారం ఆధారంగా సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని 25 ప్రాంతాల్లో అధికారులు ఏకకాలంలో తనిఖీలు నిర్వహించారు. బార్కస్ సమీపంలోని ఎర్రగుంటలోని ఓ నివాస భవనంలో అక్రమంగా పాన్‌మసాలా, గుట్కా తయారు చేస్తున్న అనధికారిక కేంద్రాన్ని అధికారులు గుర్తించారు. అక్కడ భారీగా ముడి పదార్థాలు, రసాయనాలు, తయారీకి ఉపయోగించే ఇతర సామగ్రితో పాటు ఆర్‌ఎండీ, గోవా 100, బాద్‌షా, జాఫ్రానీ గోల్డ్, విమల్ పాన్‌మసాలా తదితర వివిధ బ్రాండ్ల పేర్లు, గుర్తులతో కూడిన నకిలీ ప్యాకింగ్ సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. తయారీ యంత్రాలు, పాన్‌మసాలా, ఇతర వస్తువులు, ప్యాకింగ్ సామగ్రిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా బేగంబజార్, ఫీల్ఖానా, టోలిచౌకి, గోల్కొండ, బడాబజార్, లంగర్‌హౌజ్, బాబానగర్ ప్రాంతాల్లోని పలు ప్రదేశాల్లోనూ తనిఖీలు నిర్వహించి లెక్కల్లో చూపని పాన్‌మసాలా, ఇతర పొగాకు ఉత్పత్తుల నిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తయారైన ఉత్పత్తుల మూలం, వాటి రవాణా, పంపిణీ వ్యవస్థ, పన్ను ఎగవేత పరిమాణంపై అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. తెలంగాణ వస్తు సేవల పన్ను చట్టం–2017, కేంద్ర వస్తు సేవల పన్ను చట్టం–2017తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం బాధ్యులపై తగిన చర్యలు తీసుకోనున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ స్పష్టం చేసింది. పాన్‌మసాలా, పొగాకు సంబంధిత ఉత్పత్తుల తయారీదారులు, వ్యాపారులు, ఇతర సంబంధిత వర్గాలు అన్ని చట్టబద్ధమైన నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ సరైన లెక్కలు, రికార్డులు నిర్వహించాలని శాఖ సూచించింది. పన్ను ఎగవేత, రహస్య తయారీ, లెక్కల్లో చూపని నిల్వలు లేదా పన్ను పరిధిలోకి వచ్చే లావాదేవీలను దాచిపెట్టే చర్యలకు పాల్పడినట్లు తేలితే కఠిన చర్యలు తప్పవని వాణిజ్య పన్నుల కమిషనర్ హెచ్చరించారు.

## సూర్యాపేటలో డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

సెప్టెంబర్ 3, 2026, సూర్యాపేట (సందేశం టైమ్స్ ప్రతినిధి): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని తగ్గించి, బాధితులకు పునరావాసం కల్పించే లక్ష్యంతో జాతీయ కార్యాచరణ ప్రణాళిక (ఎన్‌ఏపీడీడీఆర్) కింద 2026–27 సంవత్సరానికి సూర్యాపేట జిల్లాలో జిల్లా డీ-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి తెలిపారు. ఈ కేంద్రం నిర్వహణకు ఆసక్తి, అర్హత కలిగిన స్వచ్ఛంద ప్రభుత్వేతర సంస్థల (ఎన్‌జీవోలు) నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వెల్లడించారు. అర్హత కలిగిన సంస్థలు కేంద్ర ప్రభుత్వ ఈ-అనుదాన్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే తమ ప్రతిపాదనలు, దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. డీ-అడిక్షన్ సెంటర్‌కు సంబంధించిన ప్రతిపాదనలను ఆన్‌లైన్ విధానంలో మాత్రమే స్వీకరిస్తామని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం సూర్యాపేట కలెక్టర్ కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్, గది నంబర్ జీ-1లో ఉన్న జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయాన్ని పని వేళల్లో సంప్రదించాలని అధికారులు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం బారిన పడిన వారికి చికిత్స, పునరావాసం, సామాజిక పునఃసమీకరణకు అవసరమైన సేవలను అందించేందుకు ఈ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## ఎరువుల ముందస్తు బుకింగ్‌కు ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్ అమలు

సెప్టెంబర్ 3, 2026, తెలంగాణ (సందేశం టైమ్స్ ప్రతినిధి): రైతులకు సబ్సిడీ ఎరువుల విక్రయాలు, పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ రూపొందించిన 'ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్' (ఎఫ్‌ఎఫ్‌ఎస్) డిజిటల్ వేదికను తెలంగాణలో దశలవారీగా అమలు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ తెలిపింది. గతంలో యూరియాను మాత్రమే యాప్ ద్వారా ముందస్తుగా బుక్ చేసుకునే అవకాశం ఉండగా, ప్రస్తుతం యూరియాతో పాటు డీఏపీ, కాంప్లెక్స్, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ వంటి ఎరువుల విక్రయాలను కూడా డిజిటల్ విధానంలో నిర్వహించేందుకు ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. రైతులు యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని నమోదు చేసుకున్న అనంతరం తమ పంట, భూమి వివరాలను నమోదు చేసి, అవసరమైన ఎరువు, పరిమాణాన్ని ఎంపిక చేసుకుని ముందస్తుగా బుకింగ్ చేసుకోవచ్చు. తమకు అనుకూలంగా, ఎరువుల నిల్వ అందుబాటులో ఉన్న అధీకృత రిటైల్ దుకాణాన్ని రైతులు ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. బుకింగ్ పూర్తయిన అనంతరం రైతుకు క్యూఆర్ కోడ్ లేదా టోకెన్ జారీ అవుతుంది. ఎంపిక చేసిన దుకాణంలో పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) యంత్రం వద్ద ఈ క్యూఆర్ కోడ్ లేదా టోకెన్‌ను ధృవీకరించుకుని ఎరువులను పొందవచ్చు. ఈ విధానం ద్వారా రైతులు ఎరువుల కోసం అనేక దుకాణాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గడంతో పాటు దుకాణాల వద్ద వేచి ఉండే సమయం, క్యూలలో నిలబడే ఇబ్బందులు కూడా తగ్గుతాయని అధికారులు తెలిపారు. రైతు నమోదు, ధృవీకరణ, పంట–భూమి వివరాల నమోదు, ఎరువుల అవసరాన్ని ఎంపిక చేసుకోవడం, దుకాణం ఎంపిక, బుకింగ్, క్యూఆర్ కోడ్ లేదా టోకెన్ జారీ, పీఓఎస్ ధృవీకరణ వంటి దశల ద్వారా కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంది. ఎఫ్‌ఎఫ్‌ఎస్ యాప్ వినియోగంలో రైతులకు కామన్ సర్వీస్ సెంటర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, అధీకృత ఎరువుల రిటైలర్లు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు సహకారం అందించనున్నట్లు వ్యవసాయ శాఖ వెల్లడించింది. రైతులు ఈ డిజిటల్ విధానాన్ని సద్వినియోగం చేసుకుని తమకు అవసరమైన ఎరువులను ముందుగానే బుక్ చేసుకుని సులభంగా, పారదర్శకంగా కొనుగోలు చేసుకోవాలని వ్యవసాయ శాఖ సూచించింది.



## కాంగ్రెస్ హామీలపై మధిరలో బీఆర్ఎస్ భారీ ధర్నా

సెప్టెంబర్ 3, 2026, మధిర (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జ్ శెట్టి సురేష్): కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో మధిర తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలోని హామీలను ఎత్తిచూపుతూ 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో మధిర పట్టణ పురవీధుల్లో బీఆర్ఎస్ శ్రేణులు బైక్ ర్యాలీ, ఫ్లెక్సీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో లింగాల కమల్‌రాజు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల సమయంలో ఆరు హామీల కార్డును ప్రతి ఒక్కరూ భద్రపరుచుకోవాలని చెప్పడంతో పాటు రూ.100 స్టాంప్ పేపర్‌పై హామీలు రాసి ఇచ్చారని, అయితే వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల కార్డును ఇకపై 'కాంగ్రెస్ బాకీ కార్డు'గా పేర్కొంటూ, ప్రభుత్వం ప్రజలకు ఎంత బాకీ ఉందో ప్రజలకు వివరించి ప్రతి కాంగ్రెస్ నాయకుడిని నిలదీసి తమకు రావాల్సిన హక్కులను సాధించుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. పుట్టిన బిడ్డలకు కేసీఆర్ కిట్, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, యువతులకు రూ.2,500, విద్యార్థినులకు స్కూటీలు, వివాహ సమయంలో రూ.1,16,000తో పాటు తులం బంగారం, ఆసరా పింఛన్లు రూ.4,000కు పెంపు, దివ్యాంగుల పింఛన్లు రూ.6,000కు పెంపు, రైతులకు రూ.15,000, రైతు కూలీలకు రూ.15,000, ఆటో కార్మికులకు రూ.10,000 వంటి పలు హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదని కమల్‌రాజు ఆరోపించారు. వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకుని ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధిర నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు



సెప్టెంబర్ 3, 2026, తెల్లాపూర్ (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): తెల్లాపూర్ డివిజన్ 263లో స్థానిక కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సంగారెడ్డి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్‌రావు హాజరై వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పర్స శ్యామ్‌రావు మాట్లాడుతూ పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, నిరుపేద కుటుంబాల సంక్షేమానికి వైఎస్సార్ విశేష కృషి చేసిన మహానేత అని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పలు సంక్షేమ కార్యక్రమాల ద్వారా లక్షలాది కుటుంబాలకు ఆయన అండగా నిలిచారని గుర్తుచేశారు. వైఎస్సార్ సేవలను ప్రజలు ఎప్పటికీ మరువరని, ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. వైఎస్సార్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పర్స శ్యామ్‌రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ భరత్, డీసీసీ జనరల్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు అరుణ్‌గౌడ్, రవి, యాదగల్, కాంగ్రెస్ నాయకులు రాజు, మంగలి మహేష్, ప్రశాంత్, బలరాం, కొల్లూరు శ్రీను, హరీష్‌గౌడ్, విక్రమ్, ప్రవీణ్ తదితరులు పాల్గొని వైఎస్సార్‌కు నివాళులర్పించారు.



## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు విద్యుత్ లైన్ పనులకు శ్రీకారం

సెప్టెంబర్ 3, 2026, అల్లాదుర్గం (సందేశం టైమ్స్ రూరల్ రిపోర్టర్ కుమార్): రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలంలో విద్యుత్ సదుపాయాల మెరుగుదలకు చర్యలు చేపట్టారు. అల్లాదుర్గం గ్రామం నుంచి ప్రసిద్ధిగాంచిన శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వరకు 11 కేవీ విద్యుత్ లైన్, విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి, డీసీసీ జిల్లా కార్యదర్శి బాలకిషన్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ లైన్, స్తంభాల పనులను త్వరితగతిన పూర్తి చేసి ఆలయానికి మెరుగైన విద్యుత్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు రమేష్, షరీఫ్, మదర్, కాంట్రాక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ప్రారంభమైన వాసవి కన్యకా పరమేశ్వరి శిఖర ప్రతిష్ఠాపన వేడుకలు

సెప్టెంబర్ 3, 2026, సంగారెడ్డి (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శిఖర ప్రతిష్ఠాపన వేడుకలు ఆలయ కమిటీ చైర్మన్ తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి వైదిక పర్యవేక్షణలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తొలిరోజు గణపతి పూజ, పుణ్యావాచనం, దీక్షాధారణ, మండప ప్రవేశం, మాతృక యోగిని పూజతో పాటు నవ చండీయాగ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆలయ శిఖర ప్రతిష్ఠాపన వేడుకలు విజయవంతంగా కొనసాగాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఆలయ కోశాధికారి జూలకంటి మల్లేశం, ఉపాధ్యక్షులు వ్యాడం రాధాకిషన్, కార్యనిర్వాహక కార్యదర్శి కొంపల్లి విద్యాసాగర్, ఆలయ కమిటీ సభ్యులు నామ భాస్కర్, జూలకంటి బుచ్చిలింగం, ఆమేటి కిట్టు, పుల్లూరి ప్రకాష్, ఆమేటి భాస్కర్, గుండ్లపల్లి నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విజయానికి మధ్యమార్గాలు ఉండవు.. నిరంతర శ్రమతోనే లక్ష్య సాధన





సెప్టెంబర్ 3, 2026, సూర్యాపేట (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): పోలీసు ప్రజా భరోసా కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలేంల గ్రామ సమీపంలో ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల డిగ్రీ కళాశాలలో సామాజిక అంశాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ హాజరై విద్యార్థులకు సామాజిక భద్రత, సైబర్ మోసాల నివారణ, మహిళల భద్రత, లక్ష్య సాధన, ఉన్నత లక్ష్యాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ విజయానికి మధ్యమార్గాలు ఉండవని, నిరంతరం కృషి చేస్తూ లక్ష్యంతో శ్రమిస్తే జీవితంలో మంచి విజయాలను సాధించవచ్చని అన్నారు. విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి జీవితంలో స్థిరపడటంతో పాటు సమాజానికి సేవ చేసే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సోషల్ మీడియా ప్రభావంతో యువత ఏకాగ్రతను, లక్ష్యాలను కోల్పోతున్నారని, సాంకేతికత, ఇంటర్నెట్ సదుపాయాలు పెరిగిన నేపథ్యంలో వాటిని మంచి మార్గంలో వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతలోని మంచి, చెడును గుర్తించి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. సైబర్ జాగ్రత్త కార్యక్రమాల ద్వారా ప్రజలను సైబర్ మోసాలపై చైతన్యవంతులను చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. గతంలో దొంగతనాలకు పాల్పడేవారు ఇళ్లకు, దుకాణాలకు వెళ్లి తాళాలు పగులగొట్టి చోరీలు చేసేవారని, ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎక్కడికీ వెళ్లకుండానే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్నారని వివరించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు, బహుమతులు, రుణాలు, ఆన్‌లైన్ వ్యాపారం వంటి ఆశలు చూపడం, డ్రగ్స్ కేసులో ఉన్నారని, డిజిటల్ అరెస్టు చేస్తున్నామని భయపెట్టడం వంటి విధానాలతో వ్యక్తిగత, బ్యాంకు ఖాతా వివరాలను సేకరించి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అపరిచితులు వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలు అడిగినప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని, విద్యార్థులు ఈ విషయాలపై తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, పరిచయస్తులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. మహిళల రక్షణ కోసం పోలీస్ అక్క కార్యక్రమం, షీ టీమ్స్, భరోసా కేంద్రం సిబ్బంది సమర్థవంతంగా పనిచేస్తున్నారని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి, షీ టీమ్స్ ఎస్ఐ నీలిమ, పోలీసు సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైఎస్సార్‌కు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఘన నివాళులు



సెప్టెంబర్ 3, 2026, హైదరాబాద్ (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): ప్రజా సంక్షేమమే పరమావధిగా జీవితాంతం పనిచేసిన మహోన్నత నాయకుడు, దార్శనిక ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాలను స్వయంగా తెలుసుకుని, వారి అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేయడంలో వైఎస్సార్ ఎంతో నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే సంకల్పంతో ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్ సేవలు దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందాయని, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఉన్నత విద్యను అందుకునే అవకాశాలు కల్పించారని గుర్తుచేశారు. వ్యవసాయం, సాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, గృహనిర్మాణం, సామాజిక సంక్షేమం తదితర రంగాల్లో వైఎస్సార్ చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ చూపిన అంకితభావం, ప్రజాసేవా స్ఫూర్తి నేటి తరానికి కూడా మార్గదర్శకమని మంత్రి పేర్కొన్నారు. వైఎస్సార్ భౌతికంగా మన మధ్య లేకపోయినా పేదలు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన సేవలు ప్రజల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతాయని దామోదర్ రాజనర్సింహ అన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు





సెప్టెంబర్ 3, 2026, మెదక్ (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం మెదక్ మండలంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు ద్వారా నిత్యావసర సరుకులు అందించడంతో పాటు, ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అర్హులైన బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా లబ్ధిదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఆరోగ్య సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెదక్ తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ కోసం గంటల తరబడి నిరీక్షణ

సెప్టెంబర్ 3, 2026, జోగిపేట (సందేశం టైమ్స్ ప్రతినిధి): జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ నమోదు కోసం వచ్చిన రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "సర్వర్ పనిచేయడం లేదు" అంటూ ఓపీ నమోదు ప్రక్రియ ఆలస్యం చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలతో వచ్చిన వారు సైతం ఓపీ కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సి వస్తోందని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతో కొందరు రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. సర్వర్ పనిచేయని సమయంలో వైద్య సేవలు అందించడంలో జాప్యం జరగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. సర్వర్ సమస్య కారణంగా అత్యవసర వైద్యం కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడకుండా మాన్యువల్ ఓపీ నమోదు సదుపాయం కల్పించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఉన్నతాధికారులను వారు కోరుతున్నారు.



# లెక్చరర్ అంతోటి తిరుపతిరావును ఫోన్‌లో పరామర్శించిన ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్

సెప్టెంబర్ 3, 2026, బోనకల్ (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్): బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ అంతోటి తిరుపతిరావు తండ్రి గోపాలరావు మంగళవారం రాత్రి 10.30 గంటల సమయంలో తీవ్ర అనారోగ్యం, వృద్ధాప్య సమస్యలతో తుదిశ్వాస విడిచారు. ఈ విషాద వార్త తెలుసుకున్న స్వేరోస్ వ్యవస్థాపకులు, మాజీ ఐపీఎస్ అధికారి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్‌కుమార్ బుధవారం లెక్చరర్ తిరుపతిరావుకు ఫోన్ చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గోపాలరావు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తనవంతు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. అనంతరం మధిర నియోజకవర్గ స్వేరోస్ కమిటీ ప్రతినిధులు తిరుపతిరావు నివాసానికి చేరుకుని గోపాలరావు పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మధిర నియోజకవర్గ స్వేరోస్ అధ్యక్షుడు సోమపొంగు శ్యామ్‌సుందర్‌తో పాటు కమిటీ సభ్యులు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, లెక్చరర్లు, గ్రామస్తులు పాల్గొని గోపాలరావుకు అంతిమ నివాళులు అర్పించారు.



# జగన్నాథపురంలో వైఎస్సార్ 17వ వర్ధంతి వేడుకలు

సెప్టెంబర్ 3, 2026, జగన్నాథపురం (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్): చింతకాని మండలం జగన్నాథపురం గ్రామ కాంగ్రెస్ శాఖ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, మత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, బలహీన వర్గాల సంక్షేమం కోసం చేపట్టిన పలు కార్యక్రమాలను నాయకులు ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు, జోనల్ ఇన్‌చార్జీలు, గ్రామ నాయకులు, సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామస్తులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేత వైఎస్సార్‌కు ఘన నివాళులు అర్పించారు.

# వెయ్యి రోజుల కాంగ్రెస్ సంక్షేమ పాలనపై నిరసన హాస్యాస్పదం



సెప్టెంబర్ 3, 2026, సూర్యాపేట (సందేశం టైమ్స్ జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం నిరుపేదలు, రైతులు, మహిళలు, యువతతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తూ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. తన నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. రైతు కుటుంబాలకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, రైతు సంక్షేమానికి ఉచిత విద్యుత్ కోసం భారీగా నిధుల కేటాయింపు, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పోలీసు ఉద్యోగాల నియామక ప్రక్రియ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ, పెన్షన్ల మంజూరు, విద్యార్థులకు పోషకాహారం, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద రోగులకు ఆర్థిక సహాయం వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వం చేపట్టిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిల చెల్లింపు, ఐటీ రంగంలో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన, హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల ఏర్పాటు వంటి అభివృద్ధి చర్యలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని వేణారెడ్డి పేర్కొన్నారు. ఇన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రజా ప్రభుత్వంపై బీఆర్ఎస్ నిరసనలు వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై మాట్లాడాలనుకుంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ముందు బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల అమలు, సాధించిన ప్రగతిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు రోడ్లపై ధర్నాలు, రాస్తారోకోలు చేయడం కాకుండా ప్రతిపక్ష పాత్రను బాధ్యతగా నిర్వహించాలని బీఆర్ఎస్ నాయకులకు సూచించారు. ప్రజా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేసేందుకు చేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజాక్షేత్రంలో తగిన సమాధానం లభిస్తుందని కొప్పుల వేణారెడ్డి హెచ్చరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారంలో కొనసాగే నైతిక హక్కు లేదు



సెప్టెంబర్ 3, 2026, అందోల్ (సందేశం టైమ్స్ అందోల్ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో కొనసాగేందుకు నైతిక హక్కును కోల్పోయిందని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం జోగిపేట పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలకు వివరించేలా ఏర్పాటు చేసిన 420 అడుగుల భారీ బ్యానర్ పట్టణ ప్రజలను, బాటసారులను ఆకట్టుకుందని తెలిపారు. వివిధ మండలాల నుంచి తరలివచ్చిన రెండు వేలకు పైగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో జోగిపేట పట్టణం కిక్కిరిసిందని, క్లాక్‌టవర్ నుంచి సుమారు రెండు కిలోమీటర్ల మేర సాగిన భారీ ర్యాలీలో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు మార్మోగాయని పేర్కొన్నారు. రాష్ట్ర పరిపాలనకు కేంద్రంగా ఉన్న సచివాలయంలోనే ఉద్యోగులు రోడ్డెక్కి సమ్మె చేసే పరిస్థితి ఏర్పడటం పాలన ఎంతగా క్షీణించిందో తెలియజేస్తోందని విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి 33 నెలలు గడిచినా ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. వృద్ధులకు ఆసరా, విద్యార్థులకు అందాల్సిన సహాయం, ఆడబిడ్డలకు ఇచ్చిన హామీల అమలు ఏమైందో ప్రజలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి కాలయాపన చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే రోజులు సమీపిస్తున్నాయని క్రాంతి కిరణ్ హెచ్చరించారు.




## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ పరితోష్ పంకజ్

సెప్టెంబర్ 3, 2026, సదాశివపేట (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ సూచించారు. సైబర్ జాగృతి దివస్‌ను పురస్కరించుకొని సదాశివపేట పట్టణంలోని హర్ష బ్యాంకెట్ హాల్‌లో సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ కొనుగోళ్లు, పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను తెరవకూడదని, ఓటీపీ, పిన్, సీవీవీ, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు అంటూ ఫోన్ చేసే వ్యక్తులను నమ్మి వ్యక్తిగత లేదా బ్యాంకింగ్ వివరాలను వెల్లడించరాదని హెచ్చరించారు. ఆన్‌లైన్ కొనుగోళ్లలో భారీ రాయితీలు, ఆకర్షణీయమైన ఆఫర్ల పేరుతో జరిగే మోసాల బారిన పడకుండా విశ్వసనీయమైన వేదికలను మాత్రమే ఉపయోగించాలని, తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయంటూ వచ్చే అనుమానాస్పద పెట్టుబడులు, ట్రేడింగ్, క్రిప్టో, షేర్ మార్కెట్ ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని, సత్వరంగా ఫిర్యాదు చేయడం ద్వారా మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. గణేష్ చతుర్థి ఉత్సవాల సందర్భంగా గణేష్ మండపాల వద్ద సైబర్ అవగాహన పోస్టర్లను ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని, శాంతి కమిటీలు, సమన్వయ సమావేశాలను కూడా సైబర్ నేరాలపై చైతన్యం కల్పించేందుకు వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో డి4సి డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, సదాశివపేట ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, సైబర్ సెల్ సిబ్బందితో పాటు సుమారు 350 మంది వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



## ఆదిలాబాద్, మామునూరు విమానాశ్రయాల పనులు వేగవంతం చేయాలి: సీఎం రేవంత్‌రెడ్డి

సెప్టెంబర్ 3, 2026, హైదరాబాద్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణలో ఆదిలాబాద్, మామునూరు (వరంగల్) విమానాశ్రయాల అభివృద్ధి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడును కోరారు. ఢిల్లీలోని రాజీవ్ గాంధీ భవన్‌లో కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి సమావేశమై రాష్ట్రంలో విమానయాన రంగ విస్తరణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. మామునూరు విమానాశ్రయానికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేసి సంబంధిత అధికారులకు అప్పగించిన విషయాన్ని సీఎం కేంద్ర మంత్రికి వివరించారు. మామునూరు విమానాశ్రయానికి రెండు వారాల్లో టెండర్ల ప్రక్రియ ప్రారంభించి, డిసెంబర్ నాటికి ప్రక్రియను పూర్తి చేసి అదే నెలలో పనులకు శంకుస్థాపన చేసేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ విమానాశ్రయంలో ప్రయాణికుల, సరుకు రవాణా టెర్మినళ్లతో పాటు విమానాల నిర్వహణ, మరమ్మతులు, సమగ్ర తనిఖీలకు ఉపయోగపడే ఎంఆర్‌ఓ సదుపాయాలను ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. విమానాశ్రయ రన్‌వేకు సంబంధించిన అంశాలను పరిష్కరించేందుకు రక్షణ, పౌర విమానయాన శాఖల అధికారులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో హెలికాప్టర్ పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి కోరగా, హుస్సేన్‌సాగర్‌లో సీ-ప్లేన్ ల్యాండింగ్ సదుపాయం ఏర్పాటుకు సంబంధించిన నివేదికను రెండు వారాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని పౌర విమానయాన శాఖ అధికారులు తెలిపారు. సమావేశంలో ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, సురేశ్ షెట్కార్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రొటోకాల్) హర్కార వేణుగోపాలరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## జీఓ 97 రద్దు చేయాలని ఆందోల్ పాలిటెక్నిక్ విద్యార్థినుల ధర్నా



సెప్టెంబర్ 3, 2026, ఆందోల్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): జీఓ నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోల్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు గురువారం జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. కళాశాల సమీపంలోని జాతీయ రహదారిపై విద్యార్థినులు పెద్ద సంఖ్యలో బైఠాయించి ప్రభుత్వం, విద్యాశాఖకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో కొంతసేపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వివాదాస్పదంగా మారిన జీఓ నంబర్ 97 కారణంగా విద్యార్థుల విద్యా భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నిర్ణయాన్ని పునఃపరిశీలించి జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం స్పందించకపోతే త్వరలోనే జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించి పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం అధికారులు, పోలీసులు విద్యార్థినులతో మాట్లాడి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించారు.




## రాఖీ పండుగ వేళ ఆర్టీసీకి రికార్డు ఆదాయం.. మెదక్ రీజియన్‌లో రూ.10.7 కోట్లు

సెప్టెంబర్ 3, 2026, మెదక్ (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాఖీ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు మెదక్ రీజియన్‌లో భారీ ఆదాయం సమకూరింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు ఆగస్టు 26 నుంచి 31వ తేదీ వరకు 255 ప్రత్యేక బస్సులను నడిపారు. ఈ ప్రత్యేక సర్వీసుల ద్వారా సుమారు 17 లక్షల మంది ప్రయాణికులు తమ స్వస్థలాలకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. మెదక్ రీజియన్ పరిధిలోని ఎనిమిది డిపోల నుంచి పండుగ రద్దీ సమయంలో సుమారు రూ.10.7 కోట్ల ఆదాయం లభించినట్లు వెల్లడించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు బస్సులను అందుబాటులో ఉంచడంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులకు ప్రయాణికుల నుంచి లభించిన స్పందన పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పండుగల సమయంలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా అదనపు సర్వీసులు అందించేందుకు చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.



## వెయ్యి రోజులు.. వెయ్యి వైఫల్యాలు: బీఆర్ఎస్ నేతల ధ్వజం

సెప్టెంబర్ 3, 2026, జోగిపేట (సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో తెలంగాణను అభివృద్ధిలో వెనక్కి నెట్టిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు జోగిపేటలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం కాన్సన్‌పల్లి నుంచి దిరాజ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా జోగిపేటకు చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ధర్నా నిర్వహించి ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వెయ్యి రోజుల పాలన పూర్తయినా ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు నెరవేరలేదని, రైతులు, నిరుద్యోగులు, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, ఎన్నికల హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో దిరాజ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మాణిక్యరెడ్డి, నర్సింహారెడ్డి, కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు రామన్నగారి నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ వ్యక్తిగత విచారణ ప్రక్రియను ముమ్మరం చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్



సెప్టెంబర్ 3, 2026, మెదక్ (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ వ్యక్తిగత విచారణను వేగవంతం చేసి, ప్రతి కేసును నిశితంగా పరిశీలించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శివంపేట మండలం కొత్తపేట గ్రామంలో ఎస్ఐఆర్‌కు సంబంధించిన విచారణ కేసులను నర్సాపూర్ ఆర్డీఓ రామకృష్ణ, తహసీల్దార్ కమలాద్రితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో గుర్తించిన తప్పుల సవరణ కోసం జారీ చేసిన నోటీసులపై జరుగుతున్న విచారణ ప్రక్రియను, విచారణ వివరాలను బీఎల్ఓ యాప్‌లో నమోదు చేసి ఏఈఆర్ఓ లాగిన్‌కు పంపే విధానాన్ని, అనంతరం ఏఈఆర్ఓ లాగిన్‌లో చేపట్టే ధ్రువీకరణ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి ఓటు జాబితాలో ఉండేలా చూడడంతో పాటు అనర్హులైన ఓట్లను నిబంధనల ప్రకారం తొలగించాలని, ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి పారదర్శకత, ఖచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొత్తపేట గ్రామంలో 187 పేరు, వయస్సు తదితర వివరాల్లో తేడాలకు సంబంధించిన అంశాలతో పాటు 2002 నాటి ఓటరు లేదా వారి పూర్వీకుల వివరాలతో అనుసంధానం చేయలేకపోవడం వంటి మొత్తం 227 తప్పులను గుర్తించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 78 మంది తమకు సంబంధించిన ఆధార పత్రాలను సమర్పించగా, వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివప్రసాద్‌తో పాటు సంబంధిత రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



## మెదక్ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

సెప్టెంబర్ 3, 2026, మెదక్ (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): మెదక్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు తెలిపారు. బుధవారం తన షెడ్యూల్ ప్రకారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పాపన్నపేట మండలం అరికెల గ్రామంలో ఐజీఎల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడం అత్యంత ప్రాధాన్యత అంశమని పేర్కొన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. పాపన్నపేట మండలంలోని అరికెల, నాగ్సన్‌పల్లి, నర్సింగ్రావుపల్లి గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులను పరిష్కరించేందుకు ఎంఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పాపన్నపేట మండల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు, సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. మెదక్ పట్టణంలోని హెచ్ కన్వెన్షన్‌లో మెదక్ మండలానికి సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డులు, సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. హవేలీ ఘన్‌పూర్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలోనూ అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల ద్వారా లభిస్తున్న ప్రయోజనాలపై లబ్ధిదారులతో ఎమ్మెల్యే మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా నాగ్సన్‌పల్లి గ్రామ సర్పంచ్ కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులు, కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు తాగునీరు, రేషన్, పింఛన్లు వంటి ప్రాథమిక అవసరాలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటూ, ప్రజల సహకారంతో మెదక్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు.



## సైబర్ మోసాలపై అప్రమత్తతే రక్షణ: డీఎస్పీ సుభాష్ చంద్రబోస్

సెప్టెంబర్ 3, 2026, మెదక్ (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): పెట్టుబడులు, డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ కొనుగోళ్ల విషయంలో సైబర్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెదక్ సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. సైబర్ జాగృతి దివస్‌ను పురస్కరించుకొని బుధవారం మెదక్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు ప్రజల అత్యాశ, భయం, తొందరపాటు వంటి అంశాలను ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పెట్టుబడి మోసాలు, డిజిటల్ చెల్లింపుల మోసాలు, ఆన్‌లైన్ షాపింగ్ మోసాల తీరును విద్యార్థులకు వివరించి, గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులు, అనుమానాస్పద యాప్‌లు, ఫోన్ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ, ఏటీఎం లేదా డెబిట్ కార్డు వివరాలు, పిన్, పాస్‌వర్డ్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని, మోసం జరిగిన వెంటనే 'గోల్డెన్ అవర్'లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సైబర్ మోసాల కారణంగా ప్రతిరోజూ ప్రజలు భారీగా ఆర్థిక నష్టాలకు గురవుతున్నారని, అప్రమత్తత, అవగాహనతోనే సైబర్ నేరాలను సమర్థంగా అరికట్టవచ్చని డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీ4సీ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.




## ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఈ నెల 15 వరకు గడువు

సెప్టెంబర్ 3, 2026, సంగారెడ్డి (సందేశం టైమ్స్ ప్రతినిధి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు. జాయింట్ డైరెక్టర్ రాంజీ సూచనల మేరకు అర్హత కలిగిన విద్యార్థులతో పాటు వివిధ కారణాలతో మధ్యలో చదువు నిలిపివేసిన విద్యార్థులు, డ్రాప్‌అవుట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాధారణ విద్యను కొనసాగించలేకపోయిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యను పూర్తి చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు గడువు ముగిసేలోగా సంబంధిత అధ్యయన కేంద్రాలను సంప్రదించి ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారులు కోరారు.



## వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ పూర్తిగా విఫలం: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి

సెప్టెంబర్ 3, 2026, సంగారెడ్డి (సందేశం టైమ్స్ ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా అన్ని రంగాల్లో ప్రజలకు నిరాశే మిగిలిందని బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి విమర్శించారు. సంగారెడ్డిలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రశ్నిస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై దాడులకు పాల్పడటం అప్రజాస్వామికమని, ప్రతిపక్షాల గొంతు నొక్కే ప్రయత్నాలను ఎంతమాత్రం సహించబోమని హెచ్చరించారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే అధికార పార్టీ ఇటువంటి చర్యలను ప్రోత్సహిస్తోందని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి సారించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని గోదావరి అంజిరెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ హామీల అమలుపై బీఆర్ఎస్ సమరభేరి




సెప్టెంబర్ 3, 2026, మధిర (సందేశం టైమ్స్ ఖమ్మం ఇన్‌చార్జి శెట్టి సురేష్): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మధిర నియోజకవర్గ కేంద్రంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు సాగగా, అక్కడి నుంచి మధిర తహసీల్దార్ కార్యాలయం వరకు కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలకు ప్రతీకగా 420 మీటర్ల పొడవైన భారీ ఫ్లెక్సీని ప్రదర్శిస్తూ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం 'ఎలక్షన్ గ్యారెంటీ బాకీ కార్డులు' చేతబట్టి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం ప్రజలను మోసం చేయడమేనని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, పింఛన్ల పెంపు, కళ్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయం, తులం బంగారం, రైతు భరోసా, పంటలకు రూ.500 బోనస్, ఉపాధి హామీ కూలీలకు ఆర్థిక సహాయం, ఆటో డ్రైవర్లకు సాయం, నిరుద్యోగ భృతి, విద్యా భరోసా, దళిత సంక్షేమం తదితర హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చింతకాని మండలానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ సర్పంచులు ప్రత్యేకంగా పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు. తిరుమలాపురం సర్పంచ్ చాపలమడుగు వీరబాబు, తిమ్మినేనిపాలెం సర్పంచ్ కొమ్ము ప్రభు, బొప్పారం సర్పంచ్ షేక్ రహీంతుల్లా, కోమట్లగూడెం సర్పంచ్ కొండూరు పరిశుద్ధరావు తదితరులు బాకీ కార్డులు ప్రదర్శిస్తూ ప్రభుత్వాన్ని నిలదీశారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను స్పష్టమైన కార్యాచరణతో నిర్ణీత కాలవ్యవధిలో అమలు చేయాలని వారు కోరారు. హామీలు అమలయ్యే వరకు ప్రజాక్షేత్రంలో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మధిర నియోజకవర్గంలోని వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, సొసైటీ డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి: కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

సెప్టెంబర్ 3, 2026, మెదక్ (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు ప్రత్యేక శ్రద్ధతో చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు కే. లక్ష్మీనారాయణ జిల్లా పర్యటనకు రాగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు స్వాగతం పలికారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, ప్రభుత్వ పథకాల అమలు, సంక్షేమ కార్యక్రమాలు, రిజర్వేషన్ల అమలు తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల వివరాలు, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాలకు అందిస్తున్న ఆర్థిక సహాయం, ఇందిరమ్మ ఇళ్లు, జాబ్ కార్డులు కలిగిన వారికి కల్పిస్తున్న ఉపాధి తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, దర్యాప్తు, చార్జిషీట్ దాఖలు, పరిహారం చెల్లింపు వివరాలను సమీక్షించి కేసుల దర్యాప్తును వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేసి బాధితులకు సకాలంలో న్యాయం, నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి నెల చివరి వారంలో మండల స్థాయిలో పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పనిసరిగా నిర్వహించి ప్రజలకు ఎస్సీ, ఎస్టీల రక్షణకు సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని, సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి మానవీయ కోణంలో సేవలు అందించాలని పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఎస్‌బీఐ బ్యాంకు ఖాతాలు తెరిపించి వారికి బీమా సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు ఏవైనా పెండింగ్‌లో ఉంటే రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విడుదలకు కృషి చేస్తానని చైర్మన్ హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అందరికీ సమన్యాయం చేస్తూ విద్యార్థులు, ప్రజలకు అందిస్తున్న సేవలను బక్కి వెంకటయ్య అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాఠశాలలు, గురుకుల, వసతి విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు ప్రతిరోజూ ఉమ్మడి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, ప్రత్యేక అధికారులతో తనిఖీలు నిర్వహిస్తూ విద్యార్థులతో కలిసి భోజనం చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, కులాంతర వివాహాల ఆర్థిక సహాయం, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని కేసుల్లో దర్యాప్తును పారదర్శకంగా నిర్వహిస్తున్నామని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంబదాసు రాజేశ్వర్, డీఎఫ్ఓ జోగి, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్‌డీఓ పీడీ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ మాణిక్యం, ఆర్డీఓలు రమాదేవి, భవయ్య, రామకృష్ణ, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు సింధు, విజయలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి నీలిమ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీల అమలు ఎక్కడ?.. జోగిపేటలో బీఆర్ఎస్ నిరసన

సెప్టెంబర్ 3, 2026, జోగిపేట (సందేశం టైమ్స్ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు గురువారం జోగిపేటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో గులాబీ జెండాలు, ప్లకార్డులు చేతబట్టి క్లాక్ టవర్ నుంచి శివాజీ విగ్రహం మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మార్గమధ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలకు తగిన ప్రాధాన్యం దక్కలేదని ఆరోపిస్తూ ప్రభుత్వంపై తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## 22/ఏ భూముల వివరాలు బహిర్గతం చేయాలి: నర్సాపూర్‌లో బీజేపీ ధర్నా

సెప్టెంబర్ 3, 2026, నర్సాపూర్ నియోజకవర్గం (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 22/ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల వ్యవహారంపై బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆందోళనలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ 22/ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం వెంటనే బహిర్గతం చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో అర్హులైన పేదలకు భూములు పంపిణీ చేయాలని కోరారు. భూముల విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి, 22/ఏ జాబితాలో ఉన్న భూములపై ప్రజలకు పూర్తి సమాచారాన్ని వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. పేదలకు న్యాయం జరిగే వరకు 22/ఏ భూముల అంశంపై తమ పోరాటాన్ని కొనసాగిస్తామని బీజేపీ నాయకులు స్పష్టం చేశారు.




## ఓటరు జాబితా సవరణను పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్

సెప్టెంబర్ 3, 2026, మెదక్ (సందేశం టైమ్స్ మెదక్ ప్రతినిధి): ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో గుర్తించిన అనామలీస్, నాన్-లింక్డ్ కేసులను ఎన్నికల నిబంధనల ప్రకారం పరిష్కరించి, మొత్తం ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ప్రస్తుతం కొనసాగుతున్న క్లెయిమ్స్ అండ్ ఆబ్జెక్షన్స్ ప్రక్రియతో పాటు ముసాయిదా ఓటరు జాబితా అనంతరం గుర్తించిన కేసులపై ఆమె సమీక్షించారు. మండలాల వారీగా గుర్తించిన అనామలీస్, నాన్-లింక్డ్ కేసులు, జారీ చేసిన నోటీసులు, నోటీసులు అందుకున్న వారి వివరాలు, పెండింగ్‌లో ఉన్న కేసులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత తేదీలో అవసరమైన ఆధారాలతో హాజరయ్యేలా బూత్ స్థాయి అధికారులు అవగాహన కల్పించాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆమోదించిన పత్రాల్లో ఏదైనా ఒకదాన్ని ఓటరు సమర్పించినప్పుడు వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఈ సవరణ ప్రక్రియ ఉద్దేశం అర్హులైన ఓటర్లను తొలగించడం కాదని, అవసరమైన ఆధారాల ద్వారా వారి వివరాలను ధృవీకరించడమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. వివాహం, వలస, కుటుంబ వివరాల్లో మార్పులు, తల్లిదండ్రుల పత్రాలు అందుబాటులో లేకపోవడం వంటి ప్రత్యేక కేసులను నిబంధనల మేరకు పరిశీలించాలని, ఆన్‌లైన్‌లో లింక్ చేసుకునే అవకాశం ఉన్న నాన్-లింక్డ్ కేసులను సంబంధిత ఓటర్లకు తెలియజేసి వెంటనే ప్రక్రియ పూర్తి చేయించాలని తెలిపారు. ప్రతి బూత్ స్థాయి అధికారి తమ పరిధిలోని కేసులపై పూర్తి అవగాహన కలిగి ఉండటంతో పాటు అవసరమైన పత్రాలు, కేసుల పురోగతికి సంబంధించిన సమాచారంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. క్లిష్టమైన కేసులను ప్రత్యేకంగా గుర్తించి, అవసరమైన సందర్భాల్లో ఉన్నతాధికారుల మార్గదర్శకాలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని కలెక్టర్ కోరారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ అంబ దాస్ రాజేశ్వర్, ఎన్నికల విభాగం అధికారి గఫార్, డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వరి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ హామీలపై బీఆర్ఎస్ భారీ ర్యాలీ.. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ధ్వజం

సెప్టెంబర్ 3, 2026, నర్సాపూర్ నియోజకవర్గం (సందేశం టైమ్స్ ప్రతినిధి): ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మభ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, వెయ్యి రోజుల పాలన పూర్తయినా ఆరు గ్యారంటీలు, 420 హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో బుధవారం భారీ ఆందోళన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని, కాంగ్రెస్ మాత్రం ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పి ప్రజలను నమ్మించి అధికారాన్ని దక్కించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మాటలతోనే కాలం వెళ్లదీస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరిత పాలన సాగిస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని, ప్రజల తరఫున తమ పోరాటాన్ని కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పంబల్ల బిక్షపతి, బాల్‌రెడ్డితో పాటు ఆయా మండలాల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లి కొడుకు అదృశ్యం.. ఆందోళనలో కుటుంబ సభ్యులు



సెప్టెంబర్ 3, 2026, నర్సాపూర్ నియోజకవర్గం (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తి గ్రామంలో తల్లి, ఆమె 11 ఏళ్ల కుమారుడు అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. ఎస్ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం చిప్పల్‌తుర్తి గ్రామానికి చెందిన గూగులోత్ రాజేందర్ ప్రైవేట్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. సుమారు 12 ఏళ్ల క్రితం శివంపేట మండలం చండీ గ్రామపంచాయతీ పరిధిలోని రూప్‌సింగ్ తండాకు చెందిన అనితను వివాహం చేసుకున్నాడు. వీరికి వర్షిత్ (11), వరుణ్‌తేజ్ (10) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. మంగళవారం రోజువారీగా రాజేందర్ సూరారంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు విధులకు వెళ్లి, సాయంత్రం సుమారు 7 గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ సమయంలో భార్య అనిత, పెద్ద కుమారుడు వర్షిత్ ఇంట్లో కనిపించకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినా వారి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. భార్య అనిత, కుమారుడు వర్షిత్ ఆచూకీ కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించాలని కోరుతూ రాజేందర్ నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## ముసాయిదా ఓటరు జాబితాను పరిశీలించుకోవాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



సెప్టెంబర్ 3, 2026, సంగారెడ్డి (సందేశం టైమ్స్ ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ కొనసాగుతున్నందున అర్హత కలిగిన ప్రతి పౌరుడు ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను తప్పనిసరిగా పరిశీలించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఎస్ఐఆర్ షెడ్యూల్‌లో భాగంగా ఆగస్టు 17న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించామని, అందులో ఏవైనా తప్పులు, మార్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 16లోగా సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) వద్ద క్లెయిమ్‌లు, అభ్యంతరాలు దాఖలు చేసుకోవాలని తెలిపారు. అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో పేరు నమోదు, వివరాల సవరణ తదితర అంశాలపై నిర్దేశిత విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో స్వీకరించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాల జాబితాలను ప్రజల సమాచారార్థం అందుబాటులో ఉంచడంతో పాటు సంబంధిత ఈఆర్ఓలు వారానికి ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందజేస్తారని తెలిపారు. జాబితాలో చేర్చిన ఏదైనా క్లెయిమ్‌పై అభ్యంతరం ఉన్నవారు నిర్దేశిత విధానాన్ని అనుసరించి సంబంధిత ఈఆర్ఓను సంప్రదించవచ్చని సూచించారు. ఈఆర్ఓ తీసుకున్న నిర్ణయంపై సంతృప్తి చెందని వారు మొదటి అప్పీల్ అధికారిగా జిల్లా మేజిస్ట్రేట్‌ను, అక్కడి నిర్ణయంపై కూడా సంతృప్తి చెందని వారు రెండో అప్పీల్ అధికారిగా ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ)ను ఆశ్రయించే అవకాశం ఉందని కలెక్టర్ వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం ప్రతి అర్హత కలిగిన పౌరుడికి చేరేలా ప్రచార మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన చోట క్లెయిమ్‌లు లేదా అభ్యంతరాలను నిర్ణీత గడువులోగా దాఖలు చేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ కోరారు.

## బాలాత్రిపురసుందరి సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన





సంగారెడ్డి, సెప్టెంబర్ 3, సందేశం టైమ్స్ ప్రతినిధి: నిజాంపేట్ సర్కిల్–191 పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో బాలాత్రిపురసుందరి సమేత విశ్వేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, అయ్యప్ప దేవాలయ కమిటీ చైర్మన్ కోలన్ చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆలయ భూమిపూజలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలన్ చంద్రశేఖర్ రెడ్డి ఆలయ నిర్మాణ నిధికి తన వంతుగా రూ.1,00,000 విరాళాన్ని ప్రకటించారు. నూతన ఆలయ నిర్మాణం త్వరితగతిన పూర్తయి కాలనీవాసులకు, భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రంగా నిలవాలని నాయకులు ఆకాంక్షించారు. శంకుస్థాపన కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దిండి యూనియన్ బ్యాంక్ శాఖకు 37వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు




దిండి, సెప్టెంబర్ 3: సందేశం టైమ్స్ ప్రతినిధి: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దిండి శాఖ 37వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. 1989 సెప్టెంబర్ 1న ప్రారంభమైన ఈ శాఖ 37 సంవత్సరాల సేవలను పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎ. మురళీకృష్ణ పాల్గొని శాఖ సిబ్బంది, ఖాతాదారులకు శుభాకాంక్షలు తెలిపారు. దిండి, పరిసర ప్రాంతాల ప్రజలకు బ్యాంకింగ్ సేవలను అందిస్తూ శాఖ విశ్వాసాన్ని పొందడం అభినందనీయమని, ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. శాఖ అభివృద్ధిలో ఖాతాదారుల సహకారం, విశ్వాసం కీలక పాత్ర పోషించాయని తెలిపారు. ప్రస్తుతం దిండి శాఖలో రూ.45 కోట్లకు పైగా డిపాజిట్లు, రూ.175 కోట్లకు పైగా రుణాలు ఉన్నాయని వెల్లడించిన ఆయన, ఈ వ్యాపార వృద్ధిని అభినందిస్తూ భవిష్యత్తులో ఖాతాదారులకు మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆర్థిక సేవలను విస్తృతం చేయాలని సిబ్బందికి సూచించారు. శాఖ మేనేజర్ సురేంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొని శాఖ ప్రగతిపై సంతోషం వ్యక్తం చేశారు. ఖాతాదారుల నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తూ, స్నేహపూర్వకమైన, సమర్థవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని సిబ్బంది తెలిపారు.




## పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే పట్టుదలతో కృషి చేయాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, సెప్టెంబర్ 3: సందేశం టైమ్స్ ప్రతినిధి: పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు నిరంతర శ్రమ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన దిశగా ముందుకు సాగితే విజయాన్ని అందుకోవచ్చని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణ, అధ్యయన సామగ్రి, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, పోలీస్ తదితర పోటీ పరీక్షలకు ఉద్దేశించిన ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించగా, కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై అభ్యర్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుతం ప్రతి పోటీ పరీక్షకు అధిక సంఖ్యలో అభ్యర్థులు హాజరవుతున్న నేపథ్యంలో పోటీని చూసి నిరుత్సాహపడకుండా ప్రణాళికాబద్ధంగా ప్రతిరోజూ నిర్ణీత సమయాన్ని చదువుకు కేటాయించాలని, పరీక్షలకు అవసరమైన పరిజ్ఞానాన్ని క్రమంగా పెంపొందించుకోవాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలు, సవాళ్లను చూసి వెనుకడుగు వేయకుండా వాటిని అవకాశాలుగా మలుచుకుని ముందుకు సాగాలని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదివి ఉద్యోగ అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం బీసీ స్టడీ సర్కిల్‌లోని తరగతి గదులు, అధ్యయన సామగ్రి, విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలు, చదువుకు అనుకూలమైన వాతావరణాన్ని కలెక్టర్ పరిశీలించి, అభ్యర్థులకు నాణ్యమైన శిక్షణ అందించడంతో పాటు అవసరమైన అధ్యయన సామగ్రిని అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణలో భాగంగా వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన విధానం, సిలబస్, ప్రాథమిక అంశాలు, సాధారణ అవగాహన తదితర విషయాల్లో అభ్యర్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందుతుందని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి జగదీష్ తెలిపారు. కార్యక్రమంలో బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## ఆరాధ్య నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో పాల్గొన్న వై. పండరి

నారాయణఖేడ్, సెప్టెంబర్ 3, సందేశం టైమ్స్ ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని మా ఫంక్షన్ హాల్‌లో సోమవారం తెలంగాణ రక్షణ సేన పార్టీ ఇన్‌చార్జి బాపు మల్ శెట్టి పుత్రిక ఆరాధ్య నూతన వస్త్రాలంకరణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా అధ్యక్షుడు బైండ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై చిన్నారి ఆరాధ్యను ఆశీర్వదించారు. అనంతరం బాపు మంజుల–మల్ శెట్టి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, అభిమానులు పాల్గొని చిన్నారి ఆరాధ్యను ఆశీర్వదిస్తూ వేడుకలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.



## గుంతలమయంగా మారిన కాన్షీరాం నగర్ రహదారి

మెదక్/అల్లాదుర్గం, సెప్టెంబర్ 3, సందేశం టైమ్స్ అల్లాదుర్గం మండల ప్రతినిధి ప్రవీణ్: అల్లాదుర్గం మండలం కాన్షీరాం నగర్ ప్రాంతంలోని రహదారి అధ్వానంగా మారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, వర్షపు నీరు వాటిలో నిలిచిపోవడంతో వాహనదారుల రాకపోకలు కష్టతరంగా మారాయి. గుంతల్లో నీరు నిలవడంతో వాటి లోతు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిపై ఏర్పడిన గుంతలను పూడ్చడంతో పాటు అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించాలని కాన్షీరాం నగర్ వాసులు కోరుతున్నారు.



## అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరు చేయాలి: సీపీఎం

అందోల్, సెప్టెంబర్ 3, సందేశం టైమ్స్ ప్రతినిధి: మండలంలోని అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి, ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం వెంటనే పక్కా ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం ఆందోల్ డివిజన్ కన్వీనర్ డి. విద్యాసాగర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు జోగిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాలకు తక్షణమే ఇళ్ల నిర్మాణానికి అనుమతులు, మంజూర్లు కల్పించాలని, ఖాళీ స్థలాలు ఉన్న అర్హులైన పేదలకు కూడా ప్రభుత్వమే పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. అర్హత ఉన్న ప్రతి నిరుపేద కుటుంబానికి ఇంటి స్థలం, పక్కా ఇల్లు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేదల ఇళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నెంబర్: TGTEL/25/A0348, టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ-మెయిల్ : sandeshamtimes@gmail.com, : www.sandeshamtimes.com, (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్ SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ - 522006.